ఓపీ కోసం బారులుతీరిన జనం



విశాఖపట్నం/మహారాణిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రి కేజీహెచ్. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచే కాకుండా విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలతోపాటు పక్కనున్న ఒడిశా, చత్తీసగఢ్ రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది నిరుపేదలు వైద్యం కోసం ఇక్కడకు వస్తుంటారు. అయితే వారికి సకాలంలో సేవలు అందడం లేదని, సీనియర్ డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలనలో తేలింది. ఇంకా ఎక్స్‌రే, ఎంఆర్ఐ వంటి పరీక్షల కోసం రోగులు రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. మందులు కూడా అన్నీ ఇవ్వడం లేదు. బయట కొనుక్కోవాల్సిందిగా చెబుతున్నారు. ఆస్పత్రిలో పరిస్థితులను తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు సోమవారం కేజీహెచ్‌ను సందర్శించారు. ఓపీ కౌంటర్‌తోపాటు ఓపీ విభాగాలు, మందులు ఇచ్చే కౌంటర్లు, రక్త పరీక్షా కేంద్రాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు యత్నించారు.

పేరుకే పెద్దాస్పత్రి

రోగులకు సక్రమంగా అందని వైద్య సేవలు

- ఓపీ సేవలకు పలు విభాగాల్లో ప్రొఫెసర్లు దూరం
- అసోసియేషన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, జూనియర్ వైద్యులపై వదిలేస్తున్న వైనం
- ఓపీ చీటీ తీసుకోవడం నుంచే సమస్యలు మొదలు...
- స్మార్ట్ ఫోన్ లేకుంటే నానాతిప్పలు
- ఏవైనా పరీక్షలు అవసరమైతే రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి
- మందులు కొరత తీవ్రం...ఒకటో, రెండో రకాలు బయట కొనుక్కోవాల్సిన దుస్థితి
- వీల్ చైర్ కావాలంటే సిబ్బందికి డబ్బులు ఇవ్వాల్సిందే

ఆంధ్రజ్యోతి విజిట్

డిజిటలీకరణతో ఇబ్బందులు

కేజీహెచ్‌లో సాధారణ వైద్య సేవలు పొందాలంటే తప్పనిసరిగా ఓపీ (అవుట్‌పేషెంట్ చీటీ) తీసుకోవాలి. ఇందుకోసం రెండు చోట్ల కౌంటర్లు ఉన్నాయి. అయితే, ఓపీని కూడా డిజిటలైజ్ చేశారు. ఓపీ తీసుకోవాలంటే అభా పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ఓపీ కోసం చాలాసేపు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. రోగులకు సహకారాన్ని అందించేందుకు సిబ్బందిని నియమించినా పాట్లు తప్పడం లేదు. స్మార్ట్ ఫోన్ లేనివారు వస్తే ఇక చెప్పాల్సిన అవసరం లేదు. ఆస్పత్రికి వచ్చే రోగులకు తొలి ఇబ్బంది ఇక్కడ నుంచే మొదలవుతోందని చెప్పవచ్చు.

సీనియర్ వైద్యులు డుమ్మా..

ఓపీ తీసుకుని ఆయా విభాగాలకు కేటాయించిన రూమ్‌లకు వెళ్లి ... మిగతా 8వ పేజీలో





ఎక్స్‌రే కోసం క్యూ

మందులు బయట కొనుక్కోమన్నారు



- ఈ దేముడు, ఎస్.రాయవరం

థైరాయిడ్ సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతున్నా. గడిచిన ఆరు నెలలు నుంచి కేజీహెచ్‌కు వస్తున్నా. ఎప్పుడు వచ్చినా కొన్ని మందులు లేవంటారు. చీటీలో ఐదు రకాల మందులు రాస్తే రెండు, మూడు ఉండవనే చెబుతారు. ఇప్పుడు మూడు రకాల మందులు రాస్తే అందులో ఒకటి లేదన్నారు. బయట కొనుగోలు చేస్తే స్ట్రిప్ రూ.300 అవుతుంది. ఇక్కడకు వస్తే ఉచితంగా మందులు ఇవ్వడంతోపాటు మంచి వైద్యం అందిస్తారని భావిస్తాం. కానీ, ఇక్కడి సిబ్బంది మాత్రం ఎప్పుడూ మందులు లేవని చెబుతున్నారు. ఉండీ ఇవ్వడం లేదో, లేక ఇవ్వడం లేదో తెలియడం లేదు.

బీపీ మందులు లేవని చెప్పారు



- టి.రాజు, మాధవదార

గుండెల్లో దడ, ఆయాసం వేధించడంతో ఆస్పత్రికి వచ్చాను. పరీక్షించిన వైద్యులు మూడు రకాల మందులు రాశారు. అందులో బీపీ మందులు లేవని చెప్పారు. బయట కొనుక్కోమన్నారు. గతంలో వచ్చినప్పుడు ఇచ్చారు. ఇప్పుడు లేవన్నారు. గతసారి లేవన్న మందులు ఇప్పుడు ఇచ్చారు. ప్రతిసారి ఏదో ఒకటి లేవని చెప్పడం ఇక్కడి సిబ్బందికి పరిపాటిగా మారింది. లేని మందులను వైద్యులు రాయకుండా ఉండాలి. లేదా రాసే మందులు ఉండేలా అధికారులు చూడాలి.

న్యూస్ బాక్స్

ఏయూ జర్నలిజం విభాగాధిపతి తొలగింపు

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సీఎం వినయ్ కుమార్‌ను బాధ్యతల నుంచి వర్సిటీ అధికారులు తొలగించారు. ఈ మేరకు రిజి స్ట్రార్ ప్రొఫెసర్ సోమవారం ఇఎస్ ధనుంజయ రావు ఆదేశాలు జారీచేశారు. ఆ బాధ్యతలను ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నరసింహరావుకు అప్పగించారు. సదరు ప్రొఫెసర్‌పై ఆరోపణలు/ఫిర్యాదులు రావడంతో చర్యలు తీసుకున్నట్టు చెబుతున్నారు. పూర్తిస్థాయి విచారణకు ఐదుగురితో కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం, ఈసీ మెంబర్ ప్రొఫెసర్ పి.సునీత, స్టాటిస్టిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ మునిస్వామి, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.నాగరాజకుమారి, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.ఈశ్వర్‌కుమార్ ఉన్నారు.

నగరంలో వర్షం

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం ఉదయం నగరంలో ఒక మోస్తరు వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన నగర వాసులు ఈ వర్షంతో సేదదీరారు. ఇదిలావుండగా ఆగ్నేయ బంగాళాఖాతంలో సోమవారం ఉదయం ఏర్పడిన అల్పపీడనం వాయుగుండం/తుపాన్‌గా మారనున్నందున బుధవారం జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): దసరా తిరుగు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖ రీజియన్ సోమవారం 30 ప్రత్యేక సర్వీసులు నడిపింది. ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు వంటి దూరప్రాంతాల్లో ఉంటున్న ఉత్తరాంధ్ర వాసులు దసరాకు స్వస్థలాలకు వచ్చారు. వీరంతా సోమవారం తిరిగి ప్రయాణం కావడంతో ఆర్టీసీకి తాకిడి పెరిగింది. దీంతో ఉదయం నుంచి హైదరాబాద్‌కు 8, విజయవాడకు 10, అమలాపురానికి 2, కాకినాడకు 5, రాజమండ్రికి 5 ప్రత్యేక సర్వీసులు నడిపారు.

ముగిసిన మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ

సిండికేట్లకు షాక్

- వేర్వేరు వ్యక్తుల పేరిట వందల్లో దరఖాస్తులు దాఖలు చేసిన మాజీ వ్యాపారులు
- లాటరీ కావడంతో వారికి స్వల్ప సంఖ్యలో దక్కినట్టు ప్రచారం
- కొత్తవారికి దక్కినవే ఎక్కువ
- వారి నుంచి దుకాణాలు చేజిక్కించుకునేందుకు సిండికేట్ల యత్నాలు
- దుకాణం ఏర్పాటుకు భవనాలు దొరకకుండా ఇబ్బందిపెడుతున్నట్టు సమాచారం
- ఎక్సైజ్ అధికారుల వైఖరిపై సర్వత్రా ఆసక్తి

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సిరిపురం కూడలిలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు గెజిట్ సీరియల్ నంబర్ ఒకటితో లాటరీ ప్రారంభమైంది. లాటరీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించారు. వీడియో రికార్డు చేయించారు. లాటరీ ప్రక్రియను ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేయడంతో దరఖాస్తుదారుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తంకాలేదు.



మద్యం దుకాణాలకు లాటరీ తీస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్. చిత్రంలో జేసీ మయూర్ అశోక్ ఉన్నారు. పక్కన హాజరైన వ్యాపారులు



జిల్లాలో 155 దుకాణాలకు 4,139 దరఖాస్తులు అందాయి. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన లాటరీ ప్రక్రియ మధ్యాహ్నం 12.50 గంటల వరకూ సాగింది. లాటరీలో అత్యధిక దుకాణాలు కొత్త వారికి లభించాయి. మొత్తం 155 దుకాణాల్లో 31 దుకాణాలు మహిళలకు దక్కడం విశేషం. గతంలో మద్యం దుకాణాలను నిర్వహించినవారు, బార్‌లు కలిగివున్న వ్యాపారులంతా కలిసి ఈసారి సిండికేట్‌గా ఏర్పడి దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో ప్రాంతంలో దుకాణాలకు ఒక్కో సిండికేట్ సభ్యులు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా వ్యూహం పన్నారు. ఒక్కో సిండికేట్ వందల సంఖ్యలో డీడీలు తీసి ఎంపిక చేసుకున్న దుకాణాలకు దరఖాస్తులు సమర్పించింది. వీరిలో ... మిగతా 8వ పేజీలో



లాటరీలో మద్యం దుకాణం దక్కించుకున్న వృద్ధురాలు



విస్తరణ చేపట్టాల్సిన అయినాడ - రేవిడి రోడ్డు

గ్రామీణ రహదారులకు మోక్షం

- నాలుగు మండలాల్లో 152 రహదారులు పునర్నిర్మాణం
- రూ.21.2 కోట్ల ఉపాధి నిధులు కేటాయింపు
- ఉత్సాహంగా ప్రారంభమైన పల్లె పండుగ

విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రోడ్లను పునర్నిర్మించాలని కూటమి పాలకులు నిర్ణయించడంతో జిల్లాలోని నాలుగు మండలాల్లో 152 రహదారులకు మోక్షం లభించనున్నది. విశాఖ జిల్లాలోని రెండు గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెందుర్తి, ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లో 12 తారు రోడ్లు, 140 సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.21.2 కోట్లు మంజూరుచేశారు. 12 తారురోడ్లకు రూ.3.66 కోట్లు, 140 సిమెంట్ రోడ్లకు రూ.17.5 కోట్లు కేటాయించారు. భీమిలి నియోజకవర్గంలో 12 తారురోడ్లు, 60 సిమెంట్ రోడ్లకు రూ.16.73 కోట్లు, పెందుర్తి నియోజకవర్గంలో 80 సిమెంట్ రోడ్లకు రూ.4.46 కోట్లు కేటాయించారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ రోడ్లను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం నిర్మించనున్నది. వైసీపీ పాలనలో జిల్లాలో ఒక్క రహదారిని కూడా కొత్తగా పునర్నిర్మించడంగానీ, మరమ్మతు చేయడం గానీ జరగలేదు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. అయినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే రహదారులను బాగుచేయిస్తామని కూటమి నాయకులు ఎన్నికల ... మిగతా 8వ పేజీలో

శ్రీరాములు @102



ఆరోగ్యసిరిమంతుడు వల్లభజోస్యుల శ్రీరాములు - 8వ పేజీలో

28న ఉక్కు కార్మికుల సమ్మె

- మెయిన్ 3లో



సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఏయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ రద్దు?

పాలక మండలి స్థానంలో బోర్డు ఆఫ్ గవర్నర్స్

- ప్రభుత్వం పరిశీలన
- సెంట్రల్ యూనివర్సిటీల్లో మాదిరిగా వేర్వేరు రంగాల్లో నిష్ణాతులను సభ్యులుగా నియమించే యోచన
- రెండు, మూడు రోజుల్లో సమావేశం కానున్న ప్రస్తుత ఈసీ
- ఆ తరువాత నూతన బోర్డు నియామకం?



విశాఖపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ)ను రద్దు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈసీ స్థానంలో సెంట్రల్ యూనివర్సిటీ తరహాలో బోర్డు ఆఫ్ గవర్నర్స్ (గవర్నింగ్ బాడీ)ను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధించి ఉన్నత విద్యా శాఖ అధికారులు సమాలోచనలు చేస్తున్నారని తెలిసింది.

కొద్దిరోజుల కిందట ఉన్నత విద్యాశాఖాధికారులతో సమావేశమైన సీఎం చంద్రబాబునాయుడు గవర్నింగ్ బాడీపై తన అభిప్రాయాన్ని వివరించినట్టు చెబుతున్నారు. సెంట్రల్ వర్సిటీల్లో బోర్డు ఆఫ్ గవర్నర్స్ పేరుతో బోర్డును ఏర్పాటుచేసి, వివిధ రంగాల్లో నిష్ణాతులను సభ్యులుగా నియమిస్తారు. అదే తరహాలో రాష్ట్రంలోని వర్సిటీల్లో బోర్డులు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారని చెబుతున్నారు. దీనివల్ల విశ్వవిద్యాలయాల అభివృద్ధికి వీలుంటుంది. దీనిపై ప్రభుత్వం నుంచి రెండు, మూడు వారాల్లో కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలిసింది.

ప్రస్తుతం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గత ప్రభుత్వం నియమించిన పాలకవర్గమే కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం వర్సిటీలకు నూతన పాలక వర్గాలను నియమించాలని తొలుత భావించింది. అయితే సెంట్రల్ ... మిగతా 8వ పేజీలో

‘హెల్త్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలి’

సిరిపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : డీడీవో అధికారాలతో సహా మొత్తం గ్రామ, వార్డు సెక్రటరీలను వైద్య, ఆరోగ్యశాఖలోకి బదలాయించాలని ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా హెల్త్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియారిటీ లిస్టులు తయారు చేసి, ఎంపీహెచ్ (ఎఫ్)గా పదోన్నతులు కల్పించాలని పైరవీలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. డేట్ ఆఫ్ డెలివరీతో సంబంధం లేకుండా అప్లై చేసిన రోజు నుంచి మెటర్నిటీ లీవ్ వర్తించే విధంగా ఆదేశాలుజారీ చేయాలని కోరారు. సరెండర్ లీవులు, యూనిఫామ్ అలవెన్స్, ఇంక్రిమెంట్లు, చైల్డ్ కేర్ లీవ్‌లు, ఎర్నిడ్ లీవ్స్ చట్ట ప్రకారం అమలు చేయాలని కోరారు.ఇంటెన్సిఫైడ్ జీఏన్‌ఎం ట్రైనింగ్ అయినా హెల్త్ సెక్రటరీలకు 115జీవోను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్, యూనియన్ గౌరవ అధ్యక్షురాలు పి.మణి, బి.జగన్, కల్యాణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



హనుమంతవాక.. ట్రాఫిక్ తికమక

» మహా రద్దీగా కూడలి » 120 సెకండ్లు.. రకరకాల సిత్రాలు

నగరంలో ట్రాఫిక్ రద్దీ ఉన్న కూడలి ఏదంటే హనుమంతువాక అని చెప్పాలి. గతంలో ఆర్టీసీ కాంప్లెక్స్, ఎన్ఏడీ కూడళ్ల వద్ద ఈ రద్దీ ఉండేది. ఫ్లై ఓవర్లు వచ్చిన తర్వాత ఈ కూడళ్ల వద్ద రద్దీ తగ్గింది. ప్రస్తుతం సిగ్నల్స్ వద్ద అధిక సమయం వేచి ఉండే కూడలి హనుమంతువాక. ఒడిశా, శ్రీకాకుళం, విజయనగరం నుంచి వచ్చే వాహనాలు, మరో వైపు నగరంలో నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలు, మరో పక్క, బీఆర్టీఎస్ రోడ్డులో నుంచి వచ్చేవి, ఇంకోవైపు కైలాసగిరి నుంచి వచ్చేవి. ఈ నాలుగు రోడ్ల కూడళ్ల వద్ద ప్రయాణికులకు ఓ వింత అనుభవం ఎదురవుతుంది. ముఖ్యంగా ఇలాంటి అనుభవం నగరంలో ఈ చోటనే అనడంలో ఏమాత్రం సందేహించాల్సిన అవసరం లేదేమో! ఎందుకంటే ఈ కూడళ్ల వద్ద వాహనాలు ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తోంది మరి.



ట్రాఫిక్ సిగ్నల్ పడినప్పుడు హనుమంతవాక కూడలిలో ఇదీ పరిస్థితి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉదయం తొమ్మిది గంటలు.. ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడింది. వాహనాలు బారులు తీరి ఉన్నాయి. హెల్మెట్, చేతులకు తొడుగులు, వెనుక బ్యాగులు, స్కూలు చిన్నారులతో ద్విచక్ర వాహనాలు కనిపిస్తున్నాయి. మరి కొందరు ఓ పక్క మెడను వాల్చేసి సీరియస్‌గా ఫోన్ మాట్లాడుతున్నారు. కొందరు చెవుల్లో ఇయర్ ఫోన్లు. మరో వాహనంపై కుటుంబం అంతా కలసి వెళ్తున్నట్లు భార్యాపిల్లలు, బ్యాగులు. కొరియర్ సామగ్రితో ఒకటి, సమయం మించిపోతున్నట్లు చిన్న సందు దొరికినా తుర్రుమంటున్న ఆటోలు. చిన్న, పెద్ద, లగ్జరీ కార్లు, గ్యాస్ సిలిండర్లతో లారీ, ఓలా, రాపిడో, ఉబర్ ఆటోలు, టాక్సీలు, సిటీ బస్సులు, స్కూలు బస్సులు.. ఇలా అన్ని రకాల వాహనాలు నిలిచిపోయిన మధ్యలో ‘సందట్లో సడేమియా..’ అన్నట్టు నెత్తిమీద నెమలి పింఛంతో తాటించి సాంబ్రాణీ పొగ వేస్తుంటాడో ఫకీరు. మనం వద్దని చెప్పేలోగా చప్పట్ల శబ్దం వినిపిస్తుంది. ‘బయ్యా..’అని పిలుస్తూ బుగ్గ మీదో, తల మీదో నిమిరడానికి ప్రయత్నిస్తూ, చేతి వేళ్ల మధ్యలో వంద, యాభై, ఇరవై, పది నోట్లు మడత పెట్టి మనకు కనిపించేలా చేతులు ఊపుతూ ఉంటారు. అలా వారు వెళ్లగానే ‘అయ్యా ధర్మం..’ అంటూ యాచకులు. చేతిలో బొమ్మలు, పెన్నులు, కారు సామగ్రి, బుడగలు ఊదేవి, చిన్న పిల్లలు చూసి మారాం చేయగలిగే వస్తువులతో ఉత్తరాది మనుషులు నలుగురైదుగురు ఇదే పనిలో ప్రతి వ్యక్తి వద్దకు కొనమని వస్తుంటారు. వీరికి బాషతో పని లేదు. దేశంలో ఎక్కడైనా వ్యాపారం చేస్తారు. వీరి వ్యాపారం సీజనల్‌గా కూడా ఉంటుంది. ఏ ఎండకు ఆ గొడుగు అన్నట్టు వర్షాకాలంలో రంగురంగుల గొడుగులు, వేసవిలో టోపీలు.. ఇలా అనేక రకాల వస్తువులతో కనిపిస్తుంటారు. ఇక్కడ ధరలు, బేరాలు కూడా భలే ఉంటాయి. అయిదు వందల ధర నుంచి వందకూ, యాభైకి దిగిపోయే విధంగా ఉంటాయి. బేరమాడేవాళ్లకి బేరమాడినంత అన్నట్టుగా ఉంటుంది వ్యవహారం. ఈ బేరం గ్రీన్ సిగ్నల్ పడే వరకే.



ఇక కారు కనిపిస్తే అక్కడకు వెళ్లి, అద్దం శుభ్రం చేస్తామని రెడీ అయిపోతాడు. వద్దని సుతారంగా చెప్పేవారు కొందరు, విసుక్కునేవారు కొందరు. ఎవరేమన్నా మారుమాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్లిపోతుంటారు. కొందరు కారు అద్దాలను టకటక కొడుతూ యాచిస్తుంటారు. ఈ విషయంలో చాలా మంది ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపిస్తుంది. అయినా వారి పద్ధతి మార్చుకోరు. కొందరు వృద్ధులు ఓ పది ఇవ్వమని అడుగుతున్నప్పుడు వారిని ఓసారి తేరిపార చూస్తే, బాగున్నట్లే ఉంటారు. కానీ ఇంట్లో పరిస్థితులు వారిని అలా దారితీసాయేమోనని అనిపిస్తుంది.

ఓ వ్యక్తి తన పదేళ్ల కుమార్తెను పట్టుకుని, చేతిలో ఓ కాగితంతో అందరి వద్దకు వెళ్తాడు. అందరికీ ఏం తినాలో డైట్ చెప్తాడు. తర్వాత చేయి చాపుతాడు. వెనుక కుమార్తె ఎందుకంటే నా ఇష్టం నీకెందుకు అని అడుగుతాడు. కళ్లు లేవంటూ ఒకరిని, కళ్లున్న మరొకరు వాహనాల వద్దకు తీసుకువెళ్లి యాచిస్తుంటారు. ఇక్కడ జరుగుతున్న తతంగమంతా మనకు ఏదోలా అనిపించినా, రోజూ అక్కడే ఉద్యోగం చేసే ట్రాఫిక్ సిబ్బంది తమకేమీ పట్టనట్లు ఎవరు హెల్మెట్ ధరించలేదో ఫొటోలు తీయడంలో బిజీగా ఉంటారు. ఎవరికి దానం చేయాలన్నా మన పరసులోనో, జేబులోనో కనీసం పది కన్నా తక్కువ నోటు ఉండదు. కాబట్టి ఆ పది ఎవరో ఒకరికి వెళుతుంది.

ఇదీ సిగ్నల్ వద్ద 120 సెకన్లలో కనిపించే మరో ప్రపంచం.

కాలుష్య రహిత విశాఖగా తీర్చిదిద్దుదాం : మేయర్

వెంకోజీపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి విజ్ఞప్తి చేశారు.సోమవారం ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకుని అందరికీ ఆమె స్ఫూర్తినిచ్చారు.


బస్సులో వస్తున్న మేయర్ హరివెంకటకుమారి

కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలి

» జిల్లా ముఠా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు డిమాండ్

మద్దిలపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్పెన్సర్‌లో పని చేసే కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ చెల్లించాలని జిల్లా ముఠా కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మన్మథరావు డిమాండ్ చేశారు. రేసపువానిపాలెంలోని స్పెన్సర్ మాల్ గేటుముందు సోమవారం నిర్వహించిన ముఠాకార్మికుల ధర్నాలో ఆయన మాట్లాడుతూ స్పెన్సర్‌లో గత ఇరవై ఏళ్లుగా 22 మంది కలాసీలు పని చేస్తున్నారన్నారు. ఇప్పుడు స్పెన్సర్ మూసివేయడానికి యాజమాన్యం నిర్ణయించడంతో కలాసీలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. కోల్‌కతా లో ఉన్న స్పెన్సర్ యాజమాన్యం ఇక్కడ నిర్వహించే లేబర్ కార్యాలయ సమావేశాలకు ఒక్కసారి కూడా రాలేదని మండిపడ్డారు. 20 ఏళ్లుగా పనిచేసిన కలాసీలకు సర్వీస్ బెనిఫిట్స్ అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నేతలు నూకనాయుడు, ఏసుబాబు, అచ్చంనాయుడు, అప్పారావుపాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న జిల్లా ముఠా కార్మిక సంఘం ప్రతినిధులు

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టుకార్డు ఉద్యమం

సిరిపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్టు ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి తెలియజేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వివిధ సంఘాల ప్రతినిధులతో ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ భాగస్వామ్య సంఘాల మిత్రులతో సమావేశం నిర్వహించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 27న లక్ష మందితో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా ఉద్యమం చేపడతామన్నారు. ప్రతి ఇంటి నుంచి కేంద్రానికి పోస్టుకార్డు పంపించి తమ నిరసన గళాన్ని వినిపించనున్నట్టు చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.10 వేల కోట్ల సాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబునాయుడు ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలతో మాట్లాడతానని చెప్పారని, కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయమై ఆయన ఎలాంటి తీపికబురూ చెప్పలేదన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలను కేంద్రంలోని పెద్దలు బానిసలుగా వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల సహకారంతో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

సంక్షిప్తంగా..

జమ్మి చెట్టు మొక్కలు పంపిణీ

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి, ఆరోగ్యానికి మేలు చేసే జమ్మి చెట్టు మొక్కలను నాటాలని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో సంస్థ పిలుపునిచ్చింది. ఎంవీపీ కాలనీలోని పలు ప్రాంతాల్లో జమ్మి మొక్కలను పంపిణీ చేశారు. దసరా వేడుకల్లో భాగంగా పది రోజులపాటు వివిధ ప్రాంతాల్లో వెయ్యి మొక్కలను పంపిణీ చేసినట్టు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం తెలిపారు. నగరంలోని ప్రముఖులతో జమ్మిచెట్టు మొక్కలను నాటించడం ఒక విధిగా తమ సంస్థ పని చేస్తోందని తెలిపారు.

వరద ఖర్చుల అవినీతి ఆరోపణలపై విచారణ

» ఐఎఫ్‌టీయూ డిమాండ్

సిరిపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరద ఖర్చుల అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంపిణీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలన్నారు. రీ సర్వే చేసి బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు. ప్రతి బాధిత కుటుంబానికి, వాహనాలకు పరిహారం అందించాలన్నారు. పరిహారాలలో అన్యాయం జరిగిందని భావించిన వారు కలెక్టరేట్‌లో ఇస్తున్న దరఖాస్తులకు ఎటువంటి రశీదులు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రతినిధి వై.కొండయ్య, ఎస్.వెంకటలక్ష్మి, లక్ష్మి, రవి, మల్లన్న, బాలనాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో పాత వెంకోజీపాలెం

వెంకోజీపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు పాత వెంకోజీపాలెం యాదవ వీధిలో చెన్నకేశవ అపార్టుమెంటు పక్క వీధిలో గత 10 రోజుల నుంచి చీకటిగా తయారైంది. కేవలం ఇండ్లలోని విద్యుత్ దీపాల వెలుతురుతో ఈ వీధి రోడ్లపై రాత్రులు వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. అసలే 4 అడుగుల వెడల్పు రోడ్డులో వాహనాలు నడపడమే కష్టం. అందులోనూ చీకటిలో వాహనాలు నడపటం అంటే ప్రమాదకరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా ఇక్కడి చెన్నకేశవ అపార్టుమెంటు గేటు వద్ద కల్వర్టు బ్రిడ్జిపై ద్విచక్రవాహనాల పార్కింగ్ అడ్డదిడ్డంగా ఉండటం వల్ల వీధులోకి వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ దీపాలను వెలిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, కల్వర్టు వద్ద అడ్డంగా ఉన్న వాహనాల పార్కింగ్‌ను ఆయా ఇంటి యజమానులకు తెలిపి నిరోధించాలని స్థానికులు కోరుతున్నారు.


లైట్లు వెలగకపోవడంతో చీకటిగా ఉన్న పాత వెంకోజీపాలెంలోని ఓ వీధి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీల షెడ్యూల్ విడుదల

విశాఖపట్నం (స్పోర్ట్సు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా స్థాయి అండర్-14, 17 బాలురు, బాలికల క్రీడా పోటీల షెడ్యూల్‌పై జిల్లాలోని అన్ని పాఠశాలలకు సమాచారమిచ్చామని ఎస్‌జీఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి దేవుడుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి టోర్నీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

షెడ్యూల్: వుడా పార్కు రింక్‌లో అండర్-14, 17 స్కేటింగ్ పోటీలు సోమవారం జరిగాయి. 15న జెడ్పీ స్కూల్ గోపాడలో అండర్-14, 17 ఫెన్సింగ్, బాల్ బ్యాడ్మింటన్; 16న దేవరాపల్లిలో అండర్-14 ఫుట్‌బాల్, అండర్-14, 17 సపక్ తక్రా, గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, అరకు వేలీ స్పోర్ట్సు స్కూల్‌లో అండర్-14, 17 అర్చరీ, వేములపూడి జెడ్పీ స్కూల్‌లో అండర్-14 కబడ్డీ పోటీలు; 17న ఎస్‌ఎఫ్‌ఎస్‌స్కూల్‌లో బాస్కెట్‌బాల్, నక్కపల్లిలో అండర్-14 హాకీ, అచ్యుతాపురంలో అండర్-14 ఖోఖో; 18న పీఎం పాలెం వీడీసీఏ గ్రౌండ్‌లో అండర్-17 క్రికెట్, కుంద్రాంలో అండర్-17 కబడ్డీ; 19న ఏయూ గ్రౌండ్‌లో అండర్-17 హాకీ, జీవీఎంసీ టెన్నిస్ కోర్టులో అండర్-14, 17 టెన్నిస్, గోపాలపట్నం ఇండోర్‌లో అండర్-14, 17 కరాటే, అనకాపల్లి జీవీఎంసీ స్కూల్‌లో చెస్, తుమ్మపాలలో అండర్-17 ఖోఖో పోటీలు; 20న చెట్టిపల్లిలో అండర్-17 వెయిట్ లిఫ్టింగ్, అండర్-14, 17 పవర్ లిఫ్టింగ్; 26న వెంపాడులో అండర్-14, 17 యోగాసన, సాఫ్ట్‌బాల్, బాక్సింగ్; 28న ఏయూ గ్రౌండ్‌లో అండర్-14, 17 అథ్లెటిక్స్; 29న శివశివాని స్కూల్‌లో అండర్-14 టేబుల్ టెన్నిస్, ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో అండర్-14, 17 స్విమ్మింగ్, హరిపాలెంలో అండర్-14, 17 త్రోబాల్; 30న శివశివానీ స్కూల్‌లో అండర్-17 టేబుల్ టెన్నిస్, ఏఎల్ పురంలో అండర్-14 వాలీబాల్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

స్కేటింగ్‌లో స్వర్ణ పతక విజేతకు సన్మానం


గౌతమ్‌ను అభినందిస్తున్న శ్రీసీతారామ సేవా సంఘం ప్రతినిధులు

వెంకోజీపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నగరంలో జరిగిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో పాత వెంకోజీపాలేనికి చెందిన కాళ్ల గౌతమ్ బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌతమ్‌కు సత్కరించారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎ.పరదేశి ఇతర కార్యవర్గ సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గ్రామస్థులు ఉన్నారు.

గ్యాస్ లీకై మంటలు : మహిళకు గాయాలు

ఆరిలోవ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులోని కనకమహాలక్ష్మి నగర్‌లో సోమవారం సాయంత్రం వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో సిలిండర్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో వారు పరుగుతు తీశారు. పరిసరాల్లోని వారంతా భయాందోళనలకు గురయ్యారు. మంటలకు వంట చేస్తున్న మహిళ గాయపడ్డారు. ఆమె గురించి వివరాలు తెలియ్సాల్సి ఉంది. ఆమెను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. స్థానికులు అగ్నిమాపక శకటానికి సమాచారం అందించారు. అయితే ఆ శకటం వచ్చేసరికి స్థానికులు మంటలను ఆర్పేశారు.ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

నవంబరు 23, 24 తేదీల్లో

వైజాగ్ జూనియర్ లిటరేచర్ ఫెస్ట్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్, సునీల్ నివేటియా తదితరులు

సిరిపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : లిట్‌లాంటర్న్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 5వ వైజాగ్ జూనియర్ లిటరేచర్ ఫెస్ట్‌ను నవంబరు 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ డైరెక్టర్ సంధ్యా గోడే, ప్రియా ఉప్పలపాటి, సానాల్ సరా తెలిపారు. సోమవారం సిరిపురం వివాన్ హోటల్‌లో వైజాగ్ జూనియర్ లిటరేచర్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, కంకటాల సీఎండీ కంకటాల మల్లిక్, పేజెస్ ఎండీ సునీల్ నివేటియా, సంధ్యా మెరెన్స్ ఎండీ కె.ఆనంద్ హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా చిన్నారుల కోసం ఈ ఫెస్టులను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మేధస్సు పెరుగుతుందన్నారు. చిన్నారుల్లో కళాత్మక ఆలోచనలు పెంపొందుతాయన్నారు. డైరెక్టర్ సంధ్యా గోడే, ప్రియా ఉప్పలపాటి సానాల్ సరా మాట్లాడుతూ 4 నుంచి 16 ఏళ్లలో విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులన్నారు. పిల్లలు వివిధ సాహిత్య రూపాల ఆధారంగా 60 సెషన్లు రెండు రోజుల పాటు నిష్ణాతులతో ఉంటుందన్నారు. స్టోరీ టెల్లింగ్, బుక్ ఫెయిర్, వర్క్‌షాప్, పెర్ఫామెన్స్, ఆదర్ ఇంటారెషన్ వంటివి హవామహల్ వేదికగా జరుగుతుందన్నారు. ఈ నెల 19న నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు కానుందన్నారు. రిజిస్ట్రేషన్ కేంద్రాలైన తనిష్క్ షోరూం వీఐపీ రోడ్డు, పేజెస్ బుక్ స్టోర్ పాత జైల్‌రోడ్డు, బుక్ మ్యాజిక్ లైబ్రరీ లాసన్స్ బేకాలనీలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రైతుబజారు సమీపంలో కొండ చిలువ కలకలం

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 28 : కాంక్రీట్ జంగిల్‌లా మారిన ఎంవీపీ కాలనీలో భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. సోమవారం సాయంత్రం రైతు బజారుకు ఆనుకుని ఉన్న ఓ దుకాణంలో కొండచిలువ కనిపించింది. వెంటనే దుకాణంలోని మహిళ కేకలు వేయడంతో జనం అలికిడికి అది ఓ మూలకు చేరి ఉండిపోయింది. స్నేక్ సొసైటీ కిరణ్‌కు సమాచారం అందించడంతో ఆయన తన బృందంతో వచ్చి చాకచక్యంగా బంధించారు. సుమారు 15 అడుగులు పొడవు ఉంది. పామును చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


15 అడుగుల కొండ చిలువ

ఇ.మర్రిపాలెం లేఅవుట్ కబ్జా!

» ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితులు ఫిర్యాదు
» మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అనుచరులు దౌర్జన్యంగా ఆక్రమించారని ఆరోపణ

అనకాపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పరవాడ మండలం ఇ.మర్రిపాలెంలోని తమ లేఅవుట్‌లో స్థలాలను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత గండి బాబ్జీ అనుచరులు కబ్జా చేశారంటూ పలువురు వ్యక్తులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అంతకుముందు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. లేఅవుట్‌లో స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టి ప్లాట్‌లను తమకు అప్పగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల్లో ఒకరైన శ్రీవాత్సవ వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

ఇ.మర్రిపాలెంలో సర్వే నంబర్లు 15, 16/1లో ఐదు ఎకరాల్లో 2012లో లేఅవుట్ వేశారు. ఇందులో సుమారు 80 మంది స్థలాలు కొనుగోలు చేశారు. నాలా ఫీజు చెల్లించిన తరువాతే లేఅవుట్‌లో ప్లాట్‌లు కొనుగోలు దారులకు రిజిస్ట్రేషన్ అయ్యాయి.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఇ-మర్రిపాలెం లేఅవుట్ బాధితులు

ఈ నేపథ్యంలో ఇటీవల అదే గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అనుచరులు దుల్ల రామునాయుడు, దుల్ల కృష్ణ, దివాకర్‌నాయుడు, మరికొంతమంది కలిసి లేఅవుట్‌లోకి చొరబడి భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. దీనిపై బాధితుల్లో ఒకరైన అగనంపూడికి చెందిన నాగరత్నం ఈనెల 6వ తేదీన పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. తరువాత విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను కలిసి కలిసి ఫిర్యాదు చేశారు. గండి బాబ్జీ అనుచరుల భూకబ్జాపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్, మంత్రి నారా లోకేశ్‌లకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

నాపై తప్పుడు ప్రచారం: గండి బాబ్జీ

ఇ.మర్రిపాలెంలోని ఒక లేఅవుట్‌లో స్థలాల కబ్జాఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీని ‘ఆంధ్రజ్యోతి’ వివరణ కోరగా.. తనను రాజకీయంగా దెబ్బ తీయాలనే ఉద్దేశంతో కొందరు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, ల్యాండ్ బ్రోకర్లు కలిసి తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన పేరుతో ప్లకార్డులు ప్రదర్శించి, తన ప్రతిష్ఠకు భంగం కలిగించిన వారికి లీగల్ నోటీసులు జారీచేసి, పరువు నష్టం దావా వేయనున్నట్టు తెలిపారు.

దడ పుట్టిస్తున్న రోడ్లు



ఆర్‌ఆర్‌వీపురం కూడలిలో ప్రమాదకరంగా గొయ్యి

▸▸ గోతులతో అధ్వానంగా మారిన రహదారులు
▸▸ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పాదచారులు, వాహనదారులు

పెదగంట్యాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మహా నగరంలోని పలు రోడ్లు వాహనదారులకు, పాదచారులకు దడ పుట్టిస్తున్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేటప్పుడు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా గోతులో పడడం ఖాయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 76వ వార్డు పరిధిలో కణేశాను ఆనుకుని ఉన్న పాత కర్ణంవానిపాలెం రహదారి దారుణంగా తయారైంది. మూడు దశాబ్దాలుగా ఈ రోడ్డుకు ఎటువంటి నిర్వహణ పనులు చేపట్టకపోవడం వల్ల ప్రస్తుతం గోతులతో అధ్వానంగా దర్శనమిస్తోంది. గంగవరం పోర్టు వై-జంక్షన్ దగ్గర నుంచి పాత కర్ణంవానిపాలేనికి ఆనుకొని ఉన్న ఈ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ లేదు. గాజువాక మునిసిపాలిటీగా ఉన్న సమయంలో రోడ్డుకు ఇరుపక్కలా కొంతమేర ఏర్పాటు చేసిన చిన్నపాటి కాలువ ఎప్పుడో పూర్తిగా పూడుకుపోయింది. దీంతో ఏ మాత్రం వర్షం కురిసినా నీరంతా రహదారిపైనే నిలిచిపోతుంది. వర్షం తెరిపిచ్చినా రోడ్డంతా చాలా రోజుల పాటు బురద పేరుకుపోయి ఉంటుంది. దీంతో మార్గంలో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహన చోదకులు నానాపాట్లు పడుతున్నారు. రాత్రి వేళలో ఏ మాత్రం ఏమరపాటుగా ఈ రోడ్డులో ద్విచక్ర వాహనం నడిపినా కింద పడిపోవడం ఖాయమని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులమయమైన ఈ రోడ్డులో రాకపోకలు సాగించడం ఎంతో కష్టతరంగా ఉంటుందని వారు వాపోతున్నారు.

కొత్తగా రహదారి వేయాలి



పాత కర్ణంవానిపాలెం రోడ్డు పూర్తిగా పాడై పోయినందున కొత్తగా రోడ్డు వేయడంతో పాటు ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఈ విషయమై ప్రజాప్రతినిధులకు, జీవీఎంసీ అధికారులకు కూడా విజ్ఞప్తి చేశాం. ఇప్పటికైనా వారు స్పందించి రోడ్డును బాగు చేయాలి. అలాగే రహదారికి ఇరువైపులా కాలువలను ఏర్పాటు చేయడంతో పాటు వీధి లైట్లను బాగు చేయాలి. -శ్రీహరి, పాతకర్ణంవానిపాలెం

ఆ మార్గంలో ఆదమరిస్తే అంతే సంగతులు..

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డు పరిధి ఆర్‌ఆర్‌వీ పురం జంక్షన్‌లో ఉన్న బీఆర్‌టీఎస్ రహదారిలో ఏర్పడిన భారీ గొయ్యి వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ఓఎన్‌జీసీ పైపు లైన్ వేశారు. అయితే పనులు పూర్తయ్యాక సరిగ్గా పూడ్చకపోవడంతో రోడ్డులో కొంత భాగం కుంగి పోయి గొయ్యిలా మారింది. ఇక్కడ విద్యుత్ దీపాలు కూడా వెలగకపోవడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఒక్కసారిగా గొయ్యిని తప్పించబోయి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌ఆర్‌వీ పురం కూడలిలో రెండు పక్కల ఉన్న సర్వీస్ రోడ్డులోని గోతులను పూడ్చివేసేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గోతులమయమైన షీలానగర్-అక్కిరెడ్డిపాలెం సర్వీస్ రోడ్డు

గోతులమయంగా షీలానగర్-అక్కిరెడ్డిపాలెం రోడ్డు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ రహదారిలోని షీలానగర్ నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు వెళ్లే సర్వీస్ రోడ్డు గోతులమయంగా మారింది. ఈ రహదారికి గత ఏడాదే మరమ్మతులు చేశారు. అయితే లారీలు వంటి భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో మళ్లీ గోతులు ఏర్పాడ్డాయి. వర్షాలకు ఆయా గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోతుల మూలం ఈ సర్వీసు రోడ్డులో రాకపోకలు సాగించాల్సిన ఆటోలు ప్రధాన రహదారిపైనే ప్రయాణిస్తున్నాయి. అందువల్ల సంబంధిత అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

21న అమృతరావు జయంతి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు నినాదంతో ఉద్యమించి స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ప్రాణాలు పణంగా పెట్టిన టి.అమృతరావు జయంతిని 21న నిర్వహించనున్నారు. ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జయంత్యుత్సవాలు నిర్వహిస్తామని అమృతరావు మనవడు టి.మోహన్‌గాంధీ తెలిపారు.

నేడు వైసీపీ నిరసన

మల్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్‌పై మల్కాపురం పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ తెరిచినందుకు నిరసనగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం నిరసన చేపడతామని పశ్చిమ వైసీపీ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ తెలిపారు. వైసీపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఫోటో14ఎంఎల్‌కేపీపీ3: కొండచిలువను పట్టుకున్న గణేష్

కొండచిలువ కలకలం

మల్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డు ఎస్‌ఆర్‌పీ డిపార్టుమెంట్ వద్ద కొండచిలువ సోమవారం కలకలం రేపింది. ఓ అధికారి తన కారును పార్కుచేసి ఆఫీస్‌లోకి వెళ్లి..తిరిగి వచ్చేసరికి కొండచిలువ కారు కిందకు వెళ్లింది. వెంటనే స్నేక్ క్యాచర్ గణేష్‌కు సమాచారం ఇవ్వడంతో అతడు పామును చాకచక్యంగా పట్టుకున్నాడు.

సినిమా గైడ్

● **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
● **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
● **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
● **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 49, టమాటా 48, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 40, పచ్చిమిర్చి 64, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 26, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 36, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 60, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 68, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	120
ఫారం ధర	149
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

వరద బాధితులకు రూ.2 లక్షల విరాళం



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

ఆటోనగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆటోనగర్ ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న గోగినేని శివరామకృష్ణ, శ్యామలాదేవి దంపతులు సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు రూ.2 లక్షలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అట్లూరి రమేష్, శ్రీను పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

అగనంపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజోతి): మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కొండయ్యవలసలో జ్యోతిరావు పూలై సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. కార్పొరేటర్‌లు బొండా జగన్, ఇల్లపు వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే పల్లెల్లో వెలుగులు

▸▸ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



ఎస్‌ఆర్‌పురంలో పల్లె పండగలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పల్లెల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలో పల్లె పండగ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఎస్‌ఆర్‌పురంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో పల్లెలు అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో బలమైన నాయకత్వం ఉందని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జోడీతో జోష్ నెలకొందని, అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది అగ్రగామిగా నిలుస్తుందన్నారు. అంతకుముందు ముదపాక, గుర్రమ్మపాలెం, వాలిమెరక, ఎస్‌ఆర్‌పురం, పినగాడి, రాంపురం, గవరపాలెం, గొరపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పంచకర్ల సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా 4.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచ్ దూది విజయలక్ష్మి, గొరపల్లి సోమునాయుడు, అయితి సింహాచలం, రెడ్డి నారాయణరావు, కరక దేవుడు, యర్ర రమణ, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలో ఉక్కు నిర్వాసిత కాలనీ స్థలాలు

గాజువాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాలనీల్లో ఖాళీగా ఉన్న స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి అగనంపూడి, వడ్లపూడి, కణితి, నడుపూరు, గంగవరం, పెదగంట్యాడ ప్రాంతాల్లో ఒక్కొక్కరికి 107 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయించారు. ఆయా కాలనీల్లో చాలా స్థలాలు ఖాళీగా ఉన్నాయి. వీటి పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో కొంతమంది దొంగ పట్టాలు సృష్టించి ఆక్రమించుకున్నారు. మరికొంతమంది పక్కా భవనాలు నిర్మించుకున్నారు. పదేళ్ల క్రితం ఎస్‌డీసీ మ్యారేడ్ మేజర్ సన్స్ పేరిట సుమారు రెండు వందల పట్టాలు జారీచేశారు. దీనిపై అప్పట్లో పెద్దఎత్తున నిరసనలు, ధర్నాలు జరిగాయి. దీంతో నాటి కలెక్టర్ కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీ విచారణ చేపట్టి పట్టాలు నిబంధనలకు విరుద్ధమని రద్దుచేశారు. ఈ జాబితాను గాజువాక, పెదగంట్యాడ తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. అయినప్పటికీ యథేచ్ఛగా కబ్జా పర్వం కొనసాగుతోంది. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఇళ్లు కోల్పోయిన వారికి స్థలం ఇచ్చినప్పటికీ ఆర్థిక పరిస్థితి అనకూలించక నిర్మాణం చేపట్టకపోవడంతో వాటిపై కబ్జా రాయుళ్ల కన్ను పడింది. దొంగ పట్టాలు సృష్టించి ఆ స్థలం తమదేనంటూ కోర్టును ఆశ్రయిస్తున్నారు. కోర్టుల చుట్టూ తిరిగే ఓపిక, ఖర్చులు భరించలేక చాలామంది స్థలం వదిలేసుకుంటున్నారు. కొన్నిచోట్ల స్టీల్‌ప్లాంట్ స్థలాలు ఖాళీగా ఉండడంతో గతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. అవి ప్రస్తుతం కనిపించడం లేదు. దీనిపై స్టీల్‌ప్లాంట్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ వద్ద ప్రస్తావించగా స్థలాలు ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.



వడ్లపూడి ఉక్కు నిర్వాసిత కాలనీ

అగనంపూడిలో భారీ వర్షం



అగనంపూడిలో కురుస్తున్న వర్షం

అగనంపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, పరిసర ప్రాంత గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. గంటకుపైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నుంచి నీరు పొంగింది. వారం రోజులుగా తీవ్ర ఎండతో విలవిల్లాడిన ప్రజలు వర్షంతో సేదతీరారు. నిర్వాసిత కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో మురుగు నీరు రహదారులపైకి చేరి నివాసితులు అవస్థలు ఎదుర్కొన్నారు.

నిరుపయోగంగా కాకానీనగర్ బస్‌బే



కాకానీనగర్‌లో రూ.33 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్

ఎన్ఏడీ జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకానీనగర్‌లో రూ.33.60 లక్షలతో చేపట్టిన బస్‌బే నిరుపయోగంగా మారింది. ఇక్కడ పాత బస్టాప్ సమీపంలోనే నిర్మించారు. ఇక్కడ ఒక్క బస్సు కూడా ఆగదు. దీంతో బిచ్చగాళ్లకు అడ్డాగా మారింది. జీవీఎంసీ నిధులు రూ.లక్షలు వెచ్చించి, ఇలా ఉపయోగం లేని ప్రదేశాల్లో బస్ బేలు నిర్మించి వృథా చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం కేవలం ప్రచారం కోసం ఇలా ప్రజాధనం వృథా చేసిందంటున్నారు. జాతీయ రహదారి ఆనుకుని పలు బస్టాప్‌లు ఇలా వృథాగా మారాయి. ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి, జీవీఎంసీలో ఇలాంటి వృథా వ్యయం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యథేచ్ఛగా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలు

కూర్మన్నపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాత్రి సమయంలో అక్రమంగా గ్రావెల్ తవ్వి, పలు చోట్ల నిల్వ చేసి పగటి పూట విక్రయాలు సాగిస్తున్న అక్రమార్కులను అధికారులు అడ్డుకోలేకపోతున్నారు. జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెం జెఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ కొండకి సమీపంలో గ్రావెల్‌ను తవ్వి, ఉడా నగర్, పకీరుతఖ్యా, కాపుజగ్గరాజుపేట ప్రాంతాలలో నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి దర్జాగా తరలిస్తున్నారు. గ్రావెల్ దందాపై ఫిర్యాదులకు స్పందించిన అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టడంతో అక్రమాలు కొనసాగుతున్నాయి. స్థానిక నేతల కనుసన్నల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, ప్రభుత్వానికి ఆదాయం రాకపోగా, హవాలా జేబులు నింపుకుంటోందన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అక్రమ తవ్వకాలు, నిల్వ, రవాణాపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అటువైపు దృష్టి సారించడం లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినా అక్రమార్కుల దందాలకు అడ్డు కట్ట పడలేదని, ప్రభుత్వ మారినా, అధికారుల తీరులో మార్పు రాలేదని విమర్శిస్తున్నారు.



కొండలను అక్రమంగా తవ్వి ఉడానగర్‌లో నిల్వ చేసిన గ్రావెల్ కుప్పలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ శేషాద్రి

గాజువాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 14 వినతులు వచ్చాయి. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ, ప్రధాన రహదారుల్లో గోతులు పూడ్చాలని స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను జెడ్సీ ఆదేశించారు.

జోన్ 8లో ఐదు వినతులు

వేపగుంట: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు వినతులు అందాయి. వేపగుంట బీసీకాలనీ కొండపైకి తాగునీరు రావడం లేదని, రహదారి ఇరుగ్గా మారిందని, బీసీకాలనీలో రోడ్డు నిర్మించాలని, దగ్గువానిపాలెంలో అక్రమనిర్మాణం అడ్డుకోవాలని, అడవివరంలో రహదారి సమస్యను పరిష్కరించాలని కోరారు. జెడ్సీ కె.హైమావతి వినతులు స్వీకరించారు.

‘ఉక్కు కార్మికులు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంకండి’

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు పరిరక్షణకు భవిష్యత్తులో చేపట్టనున్న పోరాటాలకు కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని ఉక్కు పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులు, నిర్వాసితుల పోరాటాలను పట్టించుకోలేదని ఆరోపించారు. ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్లాంట్ పరిరక్షణకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో కారు రమణ, పీవీ.రమణమూర్తి, పీవీ.నగేష్, రాథోడ్, ఎస్ఏ.నాయుడు పాల్గొన్నారు.

జోన్ -2 డీసీపీగా మేరీ ప్రశాంతి బాధ్యతల స్వీకరణ



మేరి ప్రశాంతికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

గాజువాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జోన్ -2 డీసీపీగా మేరి ప్రశాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన తుహిన్‌సిన్హా అనకాపల్లి ఎస్పీగా బదిలీపై వెళ్లడంతో ఏలూరులో ఎస్పీగా పనిచేస్తున్న మేరి ప్రశాంతి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, సీఐలు, ఎస్ఐలు అభినందనలు తెలిపారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ నిమజ్జనోత్సవం



దుర్గాదేవిని ఊరేగిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

పెదగంట్యాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సీతారామ్‌నగర్‌లో స్ట్రీట్‌బాయ్స్ యూత్ అసోసియేషన్ నిర్వహించిన దుర్గాదేవి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీ వీధుల్లో అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు. చినముషిడివాడ కూడలిలో గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో దేవి ఉత్సవాల సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ సేనాపతి వసంత, శంకరరావు ప్రారంభించారు.

స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలి

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటును సెయిల్ లేదా ఎన్ఎండీసీలో విలీనం చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికవర్గానికి ఇచ్చే బోనస్ విషయంలో అన్యాయం జరిగిందన్నారు. కనీసం జీతాలు అయినా సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంస్థను ఆదుకునేందుకు కేంద్రం ముందుకురావాలన్నారు. ప్లాంట్‌లో కార్మికుల ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్రకుమార్, పొట్ల శ్రీనివాస్, కొల్లి శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను చెల్లింపులపై అవగాహన




ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్న జాయింట కమిషనర్ ప్రసాద్

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ బలమైన పునాది కలిగి ఉందని, దేశ ఆర్థికవృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని జాయింట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ కె.ప్రసాద్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం ఆదాయ పన్నుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్ను విభాగంలో డిజిటైలైజేషన్ ప్రక్రియ నుంచి టీడీఎస్ విషయాలు, ముందుగా పూరించిన రిటర్న్‌లలో ప్రతిబింబించే ఆర్థిక సమాచారం, వార్షిక వ్యవస్థ ద్వారా డేటా సేకరణ, అప్పీళ్లు, పన్ను చెల్లింపుదార్లకు అందుతున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ ఇజ్జాడ మధుసూదనరావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు పాఠశాల భవనం ప్రారంభం

మల్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు నూతన భవనం అందుబాటులోకి రానుంది. కోరమాండల్ ఎరువుల కర్మాగారం సామాజిక సేవలో భాగంగా తక్కువ విస్తర్ణం కలిగిన స్థలంలో సుమారు రూ.28 లక్షలతో రెండంతస్థుల భవనం నిర్మించింది. ఈ భవనం మంగళవారం ప్రారంభం కానుంది. కోరమాండల్ సంస్థ ఓ విద్యా సంస్థకు నిధులు వెచ్చించడం ఇదే మొదటిసారి. పాఠశాలలో అత్యాధునిక పరికరాలతో సైన్స్ లేబొరేటరీని కూడా ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదగా పాఠశాల భవనాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

అన్నదాతకు సత్కారం



శివాజీరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గత 29 సంవత్సరాలుగా శరన్నవరాత్రుల సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్న పారిశ్రామికవేత్త శివాజీరెడ్డిని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో శీరం ఉమామహేశ్వరి, కోరాడ శ్రీనివాసరావు, పొత్తబత్తుల శ్రీనివాసరావు, రామ్మోహన్‌నాయుడు, కల్పన ఆటోస్టాండ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుమలనగర్ కాలనీకి జాతీయ అవార్డు

కూర్మన్నపాలెం,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కణితి సమీపంలోని తిరుమలనగర్‌కు మరోసారి జాతీయ అవార్డు లభించింది. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ) విభాగంలో జాతీయస్థాయి తృతీయ బహుమతి దక్కింది. కేంద్ర జలశక్తి వనరుల శాఖామాత్యులు సీఆర్ పాటిల్ సోమవారం ఐదో జాతీయ జల అవార్డులను ప్రకటించారు. ఈ వివరాలను న్యూఢిల్లీలోని శ్రమశక్తి భవన్ విడుదల చేసింది. 9 విభాగాల్లో 38 మంది విజేతలను ప్రకటించగా ఆర్‌డబ్ల్యూఏ విభాగంలో వందలాది ఇంకుడు గుంతలను తవ్వించి నీటి పొదుపునకు కృషిచేస్తున్న తిరుమలనగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్‌కు పురస్కారం లభించింది.

పార్కింగా.. రోడ్డుందిగా..!

మాధవధార ఉడాకాలనీలో ఇదీ తీరు

మాధవధార, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అందరి కోసం వేసిన మార్గాలు కొందరి సొంతమవుతున్నాయి. వారి వ్యాపారానికి మేలుబాటలయ్యాయి. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని మాధవధార ప్రాంతం ఇందుకు సాక్ష్యం. ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో అనధికార గోదాములు, వాణిజ్య కార్యకలాపాలతో నివాసితులు అవస్థలు పడుతున్నారు. మాధవధార ఉడాకాలనీ లే అవుట్‌లో దాదాపు 400 నివాస గృహాలు ఉన్నాయి. ఇక్కడ హెచ్‌ఐజీ, ఎంఐజీ, ఎల్‌ఐజీల వారీగా స్వతంత్రంగా ఉండే ఇళ్లే ఎక్కువ.కొత్తగా వాణిజ్య కార్యకలాపాలు విస్తరించడమేగాక భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. ఇది చాలదన్నట్లు దారికి అడ్డంగా వాహనాలు నిలిపివేయడం, దూకుడుగా రావడం, పెద్ద పెద్ద ట్రక్‌లు, మినీట్రక్‌లతో కాలనీ రోడ్డులో



ఉడాకాలనీ రోడ్డులో రాకపోకలకు అడ్డంగా నిలిపిన వాహనాలు



ఏటీఎం క్యాష్ వాహనాల పార్కింగ్ ఇక్కడే

ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పొడుగునా వాహనాలు ఆపడం, ఇక్కడ గెడ్డను అనుకుని ఉన్న ఫుట్ బ్రిడ్జిపై పార్కింగ్ చేయడం నిత్యకృత్యమైంది.

ఎక్కడో దుకాణాలు... ఇక్కడ గోదాములు: నివాసిత గృహాల్ని నెలవారీ అద్దె ప్రాతిపదికన తీసుకుని ఇక్కడ ఉడాకాలనీలో గోదాములు నడుపుతున్నారు. బియ్యం, పప్పులు, నూకల నుంచి వంట నూనెల వరకు గోదాములు ఉన్నాయి. సెంట్రల్ పార్కు సమీపంలో ఉన్న ఐస్‌క్రీమ్ గోదాము నుంచి నిత్యం రోడ్డుమీద పెద్ద కంటైనర్ లాంటి వాహనాల్లో ఫ్రిజ్ ఆన్ చేసి ఆ సరుకు వాహనాల్ని రోడ్లపైనే ఉంచేయడంతో అవి షాక్ కొడుతున్నాయి. పార్క్‌కు వెళ్లే పిల్లలు తెలియక వాహనాల్ని తాకడంతో పలుమార్లు కరెంట్ షాక్ తగులుతోందని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ఎంఐజీ లేఅవుట్ దారిలోని మలుపులో గెడ్డను అనుకుని నిలుపుతున్న వాహనాల్ని గుర్తించక పలువురు ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నేరుగా కొండపై ఓ వస్త్ర దుకాణానికి చెందిన గోదాముకు వెళ్లే వాహనాలతోనూ నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే హెచ్‌ఐజీ లేఅవుట్‌లో క్యాష్ ఏటీయం వాహనాల కార్యాలయం నడుపుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల క్యాష్ ఏటీయంలకు నగదు సెట్ చేయడం కోసం క్యాష్ వాహనాలు సుమారు 40 వరకు ఈ ప్రాంతం నుంచే చేరుతున్నాయి. వీటి నిర్వహణ కార్యాలయం ఇక్కడి నివాసిత ప్రాంతం మధ్యలోనే ఉండటంతో దారి పొడుగునా ఈ కార్యాలయ క్యాష్ వాహనాలే కనిపిస్తున్నాయి. దూకుడుగా వచ్చే వాహనాలతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు. స్థానికులు దగ్గరలోని ఉడాకాలనీ సచివాలయానికి, ఆర్‌అండ్‌బీ జంక్షన్‌లో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు పలుమార్లు వారి వెతలు చెప్పుకొంటున్నా పరిష్కారం కావడం లేదు. ఎక్కడో ఉండే ఈ ఇళ్ల యజమానులకు సమస్యను వివరించి ఇబ్బందుల్ని తొలగించాలని జీవీఎంసీ రెవెన్యూ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీల షెడ్యూల్ విడుదల

విశాఖపట్నం (స్పోర్ట్స్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లాస్థాయి అండర్-14, 17 బాలురు, బాలికల క్రీడా పోటీల షెడ్యూల్‌పై జిల్లాలోని అన్ని పాఠశాలలకు సమాచారమిచ్చామని ఎస్‌జీఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి దేవుడు బాబు ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి టోర్నీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

షెడ్యూల్: వుడా పార్కు రింక్‌లో అండర్-14, 17 స్కేటింగ్ పోటీలు సోమవారం జరిగాయి. మిగిలిన పోటీలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతాయి. 15న జెడ్పీ స్కూల్ గోవాడలో అండర్-14, 17 ఫెన్సింగ్, బాల్ బ్యాడ్మింటన్; 16న దేవరాపల్లిలో అండర్-14 ఫుట్‌బాల్, అండర్-14, 17 సపక్ తక్రా, గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, అరకు వేలీ స్పోర్ట్సు స్కూల్‌లో అండర్-14, 17 అర్చరీ, వేములపుడి జెడ్పీ స్కూల్‌లో అండర్-14 కబడ్డీ పోటీలు; 17న ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో బాస్కెట్‌బాల్, నక్కపల్లిలో అండర్-14 హాకీ, అచ్యుతాపురంలో అండర్-14 ఖోఖో; 18న పీఎం పాలెం వీడీసీఏ గ్రౌండ్‌లో అండర్-17 క్రికెట్, కుంద్రాంలో అండర్-17 కబడ్డీ; 19న ఏయూ గ్రౌండ్‌లో అండర్-17 హాకీ, జీవీఎంసీ టెన్నిస్ కోర్టులో అండర్-14, 17 టెన్నిస్, గోపాలపట్నం ఇండోర్‌లో అండర్-14, 17 కరాటే, అనకాపల్లి జీవీఎంసీ స్కూల్‌లో చెస్, తుమ్మపాలలో అండర్-17 ఖోఖో పోటీలు; 20న చెట్టిపల్లిలో అండర్-17 వెయిట్ లిఫ్టింగ్, అండర్-14, 17 పవర్ లిఫ్టింగ్; 26న వెంపాడులో అండర్-14, 17 యోగాసన, సాఫ్ట్‌బాల్, బాక్సింగ్; 28న ఏయూ గ్రౌండ్‌లో అండర్-14, 17 అథ్లెటిక్స్; 29న శివశివాని స్కూల్‌లో అండర్-14 టేబుల్ టెన్నిస్, ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో అండర్-14, 17 స్విమ్మింగ్, హరిపాలెంలో అండర్-14, 17 త్రోబాల్; 30న శివశివానీ స్కూల్‌లో అండర్-17 టేబుల్ టెన్నిస్, ఏఎల్ పురంలో అండర్-14 వాలీబాల్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

నిధులున్నా 'ప్రైవేటు' చూపులెందుకు?

▸▸ పోర్టు ఆసుపత్రి నిర్వహణపై సిటు నేత జగన్



దీక్షలో పాల్గొన్న కార్మిక నాయకులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రిని ప్రైవేటీకరించవద్దని సీఐటీయూ నాయకుడు బి.జగన్ కోరారు. ఆసుపత్రి ఎదుట కొనసాగిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పోర్టు సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల కష్టంతో లాభాలు మూటగట్టుకున్న ఆసుపత్రి నిర్వహణకు పుష్కలంగా నిధులున్నా ప్రైవేట్ వారికి అప్పగించాలనే బీజేపీ విధానం దుర్మార్గమన్నారు. దీక్షలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మసేను, కె.సత్యనారాయణ, మంగనాయుడు, జె.సత్యనారాయణ, మూర్తి, రవిశంకర్, రామలింగేశ్వరరావు, శంకరరావు నాయుడు, రాఘవులు, రమణ, పోతన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయం తగ్గించే నిమిత్తం నిర్వహణ పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నరసింహనగర్ రైతుబజారు, విద్యుత్‌నగర్, జీప్ షోరూమ్, ఆకాష్ కాలేజీ, పోర్టు సాగరమాల ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

శ్రద్ధా ఫౌండేషన్‌కు నిరాశ్రయుల అప్పగింత



నిరాశ్రయులతో శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతతో బాధపడుతున్న తొమ్మిది మందికి వైద్యం అందించి వారు కోలుకోవడంతో శ్రద్ధాఫౌండేషన్ ప్రతినిధులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన హరిప్రసాద్ (58), రామ్ మనోహర్ (60), గౌతమ్ (40), గొరంగో నాయక్ (39), జితేంద్ర సాహు (35), బిపిన్ కుమార్ (25), గుదియాన (37), బిందో (45), సోనమ్ (23)లను ధ్రువీకరిస్తూ రెండో పట్టణ పోలీసులు ఇచ్చిన లేఖతో అంబులెన్స్‌లో ముంబైకి పంపినట్లు చెప్పారు. వీరిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తారన్నారు. ఏయూటీడీ కార్యదర్శి వాసుతో పాటు శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు ధృవ్ బడేకర్, సుప్రియ, అబిద్, నీలేష్ ఉన్నారు.

జీతాల కోసం సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన

మహారాణిపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా జీతాలు లేవంటూ కేజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన చేపట్టారు. సోమవారం కేజీహెచ్‌లోని ప్రధాన కార్యాలయం వద్ద వీరు ఆందోళన చేస్తూ, యాజమాన్యం తమకు రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మర్రిపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద ఒకరు మృతి చెంది ఉన్నారన్న సమాచారంతో ఘటన ప్రాంతానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి సమాచారం లభించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని వయస్సు సుమారుగా 30 సంవత్సరాలు ఉంటాయని ఎరుపురంగు టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడు. అతని వివరాలు తెలిసినవారు ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫోన్ 9440904350, 0891-25120812 నంబర్లలో తెలియజేయాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోరుతూ జెడ్సీలకు వినతి



జ్ఞానాపురంలో వినతులు స్వీకరిస్తున్న జోన్-5 కమిషనర్ రాము

జ్ఞానాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులపై సత్వర చర్యలు చేపట్టాలని జోన్-5 కమిషనర్ బి.రాము సూచించారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో మూడు వినతులను స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 1, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 2 అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ టి.ఎస్ఎన్.రాజు, ఏసీపీ వెంకట్రావు, ఏఎంహెచ్ఓ సునీల్ కుమార్, ఆర్.ఓలు బాబురావు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

50వ వార్డులో సమస్యలపై వినతిపత్రం

మురళీనగర్; విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని 50వ వార్డులో పెండింగ్ దశలోనే ఉన్న పలు అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం వార్డు నాయకులు జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జెడ్సీ బి.మధుకి వినతిపత్రం అందించారు. వీధిదీపాలు వెలగకపోవడంతో ఈ ప్రాంతంలో మహిళల మెడలో గొలుసు దొంగతనాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 50వవార్డులోని బృందావన్ పార్కు, వైశాఖీ స్కేటింగ్ పార్క్‌ల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిర్మాణాలకు అంచనా వ్యయంతో టెండర్లు సిఫార్సు చేయాలని కోరినట్లు 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే సూచనలతో ప్రతిపాదించిన పనులతో పార్కులో వసతులు మెరుగవుతాయని జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. వార్డు నాయకులు, 50వవార్డు నివాసితులు పాల్గొన్నారు.

సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో...

సీతమ్మధార: సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అర్బన్ తహసీల్దార్ రమేష్ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.


బ్రహ్మకుమారీల సేవలు స్ఫూర్తిదాయకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పోలీసు కమిషనర్ బాగ్చి, చిత్రంలో ఎంపీ శ్రీభరత్, బ్రహ్మకుమారి రామేశ్వరి

డాబాగార్డెన్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీలు అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు స్ఫూర్తిదాయకమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. సోమవారం సాయంత్రం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మకుమారీల కేంద్రాలు ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతున్నాయన్నారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ఎలా జీవించాలి అంటే బ్రహ్మకుమారీల బోధనలు పాటించాలన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరి, మధు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక విప్లవానికి బౌద్ధ ధర్మం ప్రతీక



సందేశమిస్తున్న అనాలయో

సీతంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక విప్లవానికి ప్రతీకగా బౌద్ధ ధర్మం నిలుస్తుందని తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరంలోని బౌద్ధ ధర్మ పీఠానికి చెందిన పూజ్య భంతే అనాలయో తెలిపారు. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో బౌద్ధ విహార్‌లో అశోకుని బౌద్ధ విజయదశమి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా అంబేడ్కర్, రమాబాయి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధ విహార్‌లో బుద్ధుడి విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి వందనం చేశారు. ఈ సందర్భంగా పూజ్య భంతే అనాలయో బౌద్ధ సందేశాన్ని ఇచ్చారు. ప్రపంచ మానవాళి శాంతి, సామరస్యం, సౌభాగ్యాలకు బౌద్ధ ధర్మమే శరణ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టమాటా విక్రేతల ఆందోళన

అక్కయ్యపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): టమాటా ధర పెరుగుతుండడంతో వినియోగదారులు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతుండడాన్ని గుర్తించిన ప్రభుత్వం సబ్సిడీ ధరపై పంపిణీ చేయాలని నిర్ణయించింది. రైతుబజార్లకు పంపించి కిలో రూ.48లకే విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. ఇంతవరకూ బాగానే ఉంది. కానీ రైతుబజార్లలో టమాటా విక్రయించే డ్వాక్రా గ్రూపుల వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. నరసింహనగర్ రైతుబజారుకు సోమవారం 90 చిన్న క్రేట్లు వచ్చాయి. ఒక్కో క్రేట్‌లో 16 కిలోల టమాటా ఉంది. ఇందులో సుమారు రెండు కిలోల టమాటా చితికిపోయి పాడైంది. వీటిని కొనుగోలుదారులు తీసుకోవడం లేదు. క్రేట్‌లో ఎన్ని కిలోల టమాటా ఉందో అన్నింటికీ రూ.48 చొప్పున అధికారులకు చెల్లించాల్సిందేనని వ్యాపారులు వాపోతున్నారు.

అలరించిన సినీ గీతాలాపన



గాయని కల్యాణి, అరుణ్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న కళారంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కళలకు విశాఖ చిరునామాగా నిలుస్తోందని పలువురు కళారంగ ప్రముఖులు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఎంవీఆర్ సంస్థ నిర్వహణలో గాయనీమణి భళ్లమూడి కల్యాణి మూడు గంటల నిర్విరామ సినీ గీతాలను సోమేష్ బృందం పాడి ఆద్యంతం అలరించింది. అలనాటి మేటి గేయాలను ఆలపించడంలో గాయనీమణులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అరుణ్‌కుమార్ కల్యాణి దంపతులను సన్మానించారు. తదుపరి గాయనీగాయకులు రాజేంద్రప్రసాద్, కాంతారావు, ఫణి, సంత్యానందం, భూపతి, కృష్ణంరాజు, ఆంజనేయరెడ్డి, ఎండీ ఖాన్, భయ్యా శ్రీనివాస్, కడలి విజ్జు గేయాలను ఆలపించి వీక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం ఎంవీఆర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ కళలను కాపాడుకునేందుకు గాయనీగాయకులు ముందుకురావడం ఆనంద దాయకమన్నారు. కార్యక్రమంలో రూపవాణి, డా.రహమతుల్లా, ఫణిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ జిల్లా ఉద్యోగుల కార్యవర్గం



ఎన్నికైన నూతన కమిటీని అభినందిస్తున్న ఆర్డీడీ ఆర్.వి.రమణ

కంచరపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు సోమవారం కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో నిర్వహించారు. ప్రభుత్వ ఐటీఐల రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా బి.ఈశ్వర్రావు, ఉపాధ్యక్షులుగా డి.వెంకటేశ్వర్రావు, పి.వెంకటేశ్వర్రావు, కార్యదర్శిగా జీవీ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా ఆర్.సతీష్ కుమార్, సీహెచ్.లలిత కుమారి, ట్రెజరర్‌గా వి.శ్రీనివాసరావుతో పాటు ఈసీ మెంబర్లుగా కె.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, వరప్రసాద్ ఎన్నికయ్యారు. వీరిని ఆర్డీడీ ఆర్.వి.రమణ, ఉద్యోగులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం



31వ వార్డులో పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

డాబాగార్డెన్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జోనల్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్, ఎస్‌బీఐ కాలనీ, బొడ్డునాయుడుతోట తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరిస్తూ, ఎవరూ కాలువలో వ్యర్థాలు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలువ వద్ద బ్లీచింగ్ పౌడరు వేయాలన్నారు. రోడ్లపై ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్త లేకుండా చూడాలన్నారు. వార్డులోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి పారిశుధ్య కార్మికుల హాజరుపట్టికను పరిశీలించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కామేశ్వరరెడ్డి, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

దుర్గమ్మ మండపాల వద్ద పేదలకు అన్నదానం

కంచరపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో దుర్గమ్మ మండపాల వద్ద భక్తులు, పేదలకు సోమవారం అన్నదానం నిర్వహించారు. కంచరపాలెం ఫ్లైఓవర్ దిగువన, స్థానిక పరమేశ్వరి థియేటర్ ప్రాంగణంలో చేపడుతున్న అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించారు. వివిధ ఆటో స్టాండ్ల వద్ద సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. పలు ప్రాంతాల్లో అమ్మవారి పూజలు ఇంకా కొనసాగుతున్నాయి.

ఇ.మర్రిపాలెం లేఅవుట్ కబ్జా!

▸▸ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో బాధితుల ఫిర్యాదు

▸▸ మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అనుచరులు దౌర్జన్యంగా ఆక్రమించారని ఆరోపణ



. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఇ-మర్రిపాలెం లేఅవుట్ బాధితులు

అనకాపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం ఇ.మర్రిపాలెంలోని తమ లేఅవుట్‌లో స్థలాలను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత గండి బాబ్జీ అనుచరులు కబ్జా చేశారంటూ పలువురు వ్యక్తులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అంతకుముందు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. లేఅవుట్‌లో స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టి ప్లాట్‌లను తమకు అప్పగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల్లో ఒకరైన శ్రీవాత్సవ వెల్లడించిన వివరాలిలా వున్నాయి. ఇమర్రిపాలెంలో సర్వే నంబర్లు 15, 16/1లో ఐదు ఎకరాల్లో 2012లో లేఅవుట్ వేశారు. ఇందులో సుమారు 80 మంది స్థలాలు కొనుగోలు చేశారు. నాలా ఫీజు చెల్లించిన తరువాతే లేఅవుట్‌లో ప్లాట్‌లు కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అదే గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అనుచరులు దుల్ల రామునాయుడు, దుల్ల కృష్ణ, దివాకర్‌నాయుడు, మరికొంతమంది కలిసి లేఅవుట్‌లోకి చొరబడి భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. దీనిపై బాధితుల్లో ఒకరైన అగనంపూడికి చెందిన నాగరత్నం ఈనెల 6వ తేదీన పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. తరువాత విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను కలిసి కలిసి ఫిర్యాదు చేశారు. గండి బాబ్జీ అనుచరుల భూకబ్జాపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

నాపై తప్పుడు ప్రచారం: గండి బాబ్జీ

ఇ.మర్రిపాలెంలోని ఒక లేఅవుట్‌లో స్థలాల కబ్జాఆరోపణలపై మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. తనను రాజకీయంగా దెబ్బ తీయాలనే ఉద్దేశంతో కొందరు స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, ల్యాండ్ బ్రోకర్లు కలిసి తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన పేరుతో ప్లకార్డులు ప్రదర్శించి, తన ప్రతిష్ఠకు భంగం కలిగించిన వారికి లీగల్ నోటీసులు జారీచేసి, పరువు నష్టం దావా వేయనున్నట్టు తెలిపారు.

ఆలయ భూములపై కన్ను

- తగరపువలసలో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- హెచ్చరిక బోర్డులున్న స్థలాలే లక్ష్యం
- మూడు గుళ్ల అమ్మవారి దేవస్థానం భూములు కబ్జా
- ప్రస్తుత మార్కెట్ విలువ రూ. కోటి


అధికారులు గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు (ఫైల్)

తగరపువలస, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు సంగివలస ప్రాంతంలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ఆక్రమిత భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నా.. మళ్లీ కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఈ భూమి విలువ మార్కెట్‌లో సుమారు కోటి రూపాయలు ఉంటుందని అంచనా. ఈ భూమి ఆక్రమణ జరిగినట్టు 2022 డిసెంబర్‌లో దేవాదాయ శాఖ అధికారులు గుర్తించి సిబ్బందితో వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

జాతీయ రహదారికి సమీపంలో 32 సెంట్లలో ఉన్న ఈ భూమి సర్వే నంబరు 89-2 పరిధిలో ఉంది. ఈ నంబరు దేవాదాయ శాఖ ఆధీనంలో ఉంది. అయినప్పటికీ కొంతమంది దీన్ని స్వాధీనం చేసుకోవడానికి చదును చేయించి, ప్రహరీ మాదిరిగా చుట్టూ గుడ్డ ఏర్పాటు చేశారు. ఇక్కడికి సమీపంలోనే కొన్ని ప్రైవేటు భూములు ఉండడంతో ఇది కూడా ఎవరో ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసి ఉంటారని స్థానికులు తొలుత భావించారు.కానీ ఈ భూమికి సంబంధించిన పనులు జరుగుతుండడంతో కొంతమంది స్థానికంగా ఉన్న మూడుగుళ్ల అమ్మవార్ల ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు దేవాదాయ రికార్డులను రప్పించి చూడగా అది ఆలయానికి చెందిన భూమిగా ఉంది. వెంటనే వెళ్లి పనులను నిలుపుదల చేయించి, అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో తమ పని పూర్తయిపోయిందని అధికారులు భావించారు. కానీ ఈ భూమిని మళ్లీ స్వాధీనం చేసుకోవడానికి కబ్జాదారులు ప్రయత్నాలు ప్రారంభించారు. మొదట భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులకు, సిబ్బందికి బదిలీ కావడంతో ఈ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. దేవాదాయ శాఖ అధికారులు భూఆక్రమణ జరిగినట్టు గుర్తించగానే సిబ్బందితో కలిసి వెళ్లి అక్కడ హెచ్చరిక బోర్డు పెట్టి, పత్రికలకు ఫొటో విడుదల చేస్తున్నారు. కానీ తర్వాత ఆ భూమి ఎలా ఉందన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అనేక భూముల్లో ఆక్రమణదారులు బోర్డులను తొలగించి, మళ్లీ యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. తగరపువలస పరిధిలో అధికారులు 80 వరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే పది బోర్డులు కూడా ఎక్కడా కనిపించడం లేదు. విలువైన భూముల విషయంలో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండకపోతే ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన భూముల పరిస్థితిని పునఃపరిశీలన చేయాలని కోరుతున్నారు.

కాగా ఈవిషయమై దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల వద్ద ప్రస్తావించగా ఆక్రమణలు ఎక్కడ జరిగినా వెంటనే వెళ్లి పరిశీలిస్తున్నామన్నారు. భీమిలి పరిధిలో ఎన్ని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం.. ఎన్ని ఉన్నాయన్న వివరాలను పరిశీలన చేయాలని దిగువ స్థాయి అధికారులను ఆదేశించినట్టు ఆయన తెలిపారు.

28 అభివృద్ధి పనులకు రూ. 4. 32 కోట్ల మంజూరు

పద్మనాభం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పలు పంచాయతీలకు పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4.32 కోట్ల నిధులతో చేపట్టనున్న 28 అభివృద్ధి పనులకు పనులు చేపట్టడానికి పరిపాలన ఆమోదం ఇస్తూ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధుల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 75 శాతం వాటాగా రూ.3.24 కోట్లు, 25 శాతం కన్వరెన్సు నిధులు రూ10.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనులు, కల్వర్టుల పనులు చేపట్టనున్నారు. వారం రోజుల్లో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


గొల్లల తాళ్లవలసలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన తాళ్లవలసలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ప్రధాన అంశాలుగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. అనంతరం గొల్లల తాళ్లవలసలో రూ. 30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు డీఏఎన్ రాజు, నాయకులు కె. రాజబాబు, నాగ సందీప్, కె. రామానాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, తదితరులు పాల్గొన్నారు. కాగా అంతకముందు ఎమ్మెల్యే నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై తన కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో 64 అభివృద్ధి పనులు మంజూరు కాగా వాటిలో 15 పూర్తయ్యాయయని చెప్పారు. 21 పనులు జరుగుతున్నాయని, మిగిలిన వాటిని పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. భీమిలి మండలానికి మంజూరైన 11 పనుల్లో 2 మాత్రమే ప్రారంభమయ్యాయని ఒక్కటి కూడా పూర్తి కాలేదన్నారు.


కాలువలో పడిపోయిన పలక

ప్రమాదకరంగా కాలువలపై పలకలు

మధురవాడ, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డులో సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న కాలువలపై పలకలు ప్రమాదకరంగా ఉన్నాయి. ముఖ్యంగా కారుషెడ్ కూడలి నుంచి మధురవాడ వరకు కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లపై సిమెంటు పలకలు లేవు. మరి కొన్నిచోట్ల పలకలు కాలువలోకి కుంగిపోయాయి. దీంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాలువలపై పలకలను సరి చేయాలని పలువురు కోరుతున్నారు.

'ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలి'

పద్మనాభం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి, భవన నిర్మాణ కార్మికులకు ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పలు గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులతో సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా ఉచిత ఇసుక పాలసీ అమలు చేయడం లేదన్నారు. అధికార పార్టీ నేతలకు మద్యం షాపుల ఏర్పాటుపై ఉన్న శ్రద్ధ ఉచిత ఇసుక పాలసీపై లేదని విమర్శించారు.

చంద్రంపాలెంలో అన్నదానం

కొమ్మాది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం అన్నదానం ఏర్పాటు చేశారు. అంతకముందు కలశ స్థాపన సందర్భంగా కలశ జలాలతో సహస్రధార శాంతి అభిషేకం, పంచామృత సుగంధ జలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు అనంతవరం. పెంట గ్రామాల్లో 'పల్లె పండుగ'

పద్మనాభం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం, పెంట గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం. విజయకుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా హాజరై 15వ ఆర్థిక సంఘం, ఉపాధి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

సినిమా గైడ్

- **వేట్టయాన్ :** సంగం, రమాదేవి, వెంకటేశ్వర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, లక్ష్మి (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాత (తగరపువలస)
- **విశ్వం :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),మోహిని కాంప్లెక్స్ లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **జనక అయితే గనక :** శారద, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **మా నాన్న సూపర్‌హీరో :** గోకుల్, మౌర్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **శ్వాగ్ :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 49, టమాటా 48, వంకాయలు (తెలుపు)34, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 40, పచ్చిమిర్చి 64, కాకరకాయలు 36, బీరకాయలు 44, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 26, క్యారెట్ 46 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 36, దోసకాయ 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 60, కీరదోస 32, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడ దుంపలు 32, కంద 62, దేముడు చిక్కుడు 68, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
ఫారం ధర	149
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

వైసీపీ సేవలో అప్పన్న ఆలయ ఉద్యోగులు

- ఇప్పటికీ మాజీ ఎమ్మెల్యేలు, పాలక మండలి మాజీ సభ్యుల హవా
- ప్రతి నిత్యం సిఫార్సు లేఖలు
- అనుమతిస్తున్న అధికారులు


వాసుపల్లి కారుకు ఎమ్మెల్యే అని అతికించిన స్టిక్కర్

సింహాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మారి మూడు నెలలు కావస్తోన్నా.. ఇప్పటికీ సింహాచలం దేవస్థానంలో వైసీపీ ప్రజాప్రతినిధుల హవానే కొనసాగుతోంది. వైసీపీ పాలనలో రెండుసార్లు రెండేళ్ల కాలపరిమితితో రెండు పాలక మండళ్లలో పద్నాలుగు మంది సాధారణ సభ్యులతో పాటు నలుగురు చొప్పున ప్రత్యేక ఆహ్వానితులను నియమించారు. వాళ్ల పదవీ కాలం,అలాగే నగరంలో వైసీపీ ఎమ్మెల్యేల పదవీ కాలం ముగిసి సుమారు నాలుగు నెలలు కావస్తోంది. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఇప్పటికీ పదిరోజులకు ఒకసారి కనీసం నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది అనుచరులతో స్వామివారి దర్శనానికి వస్తుంటారు. తన కారుకు ఎమ్మెల్యే స్టిక్కర్ అతికించుకుని సింహగిరి టోల్‌గేట్ టికెట్ తీయకుండా రావడమే కాకుండా దర్శనానికి కూడా టికెట్టు తీయకుండా దర్జాగా ప్రధాన రాజగోపుర మెట్లపై నుంచి అంతరాలయంలోకి వెళ్లడం షరా మామూలుగా మారింది. మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ మంత్రులు, ఆలయ పాలక మండళ్ల మాజీ సభ్యులు ప్రతిరోజూ దేవస్థానం అధికారులకు లేదా దేవస్థానంలోని తమ అభిమానులకు, పీఆర్ఓ ఆఫీసుకు ఫోన్లు చేయడం ప్రొటోకాల్ పాటించాలని, ప్రత్యేకంగా వ్యక్తిని ఇచ్చి తమ వారికి దర్శనాలు చేయించాలంటూ వత్తిడి చేయడం సర్వ సాధరణంగా మారింది. సింహాచల దేవస్థానంలో గతంలో వైసీపీ ఎం ప్లాయిస్ యూనియన్‌ను స్థాపించి దానికి నాయకత్వం వహించిన కొందరు నాయకులు ప్రస్తుతం అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతూ పబ్బం గడుపుకోవ డంతో పాటు తమకు, లేదా తాము సిఫార్సు చేసిన వారికి కోరిన విభాగాల్లో పోస్టులు వేయిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దేవస్థానం అధికారులు వైసీపీ నేతల సేవలో తరించడాన్ని పలువురు విమర్శిస్తున్నారు.


దేవానంద్‌ను సన్మానిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

బదిలీ ఉద్యోగులకు సన్మానం

కొమ్మాది, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) :విధి నిర్వహణలో బదిలీలు సర్వసాధారణమని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. సోమవారం బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా పని చేస్తూ అడిషనల్ కమాండెంట్‌గా కాకినాడ బదిలీపై వెళుతున్న పి. దేవానంద్‌ను, యూనిట్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ సింహాచలం బదిలీపై వెళుతున్న బి. రాజశేఖర్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా కమాండెంట్ మురళీ కృష్ణ పరేడ్ గ్రౌండ్‌లో పరేడ్‌ను, పిటి, డ్రిల్, ఆయుధ క్లాసు, మాబ్ ఆపరేషన్‌ను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి. సత్యం, జి.ఇలియసాగర్, వి.నారాయణరావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆలయం పక్కన ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు తొలగించాలి

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి


జడ్జీకి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీచ్‌రోడ్‌లో అయ్యప్ప ఆలయానికి ఆనుకుని ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను తక్షణమే తొలగించాలని పట్టణ అయ్యప్ప సేవా సంఘం సభ్యులు జడ్జీ ప్రేమ ప్రసన్న వాణిని కోరారు. సోమవారం వారు జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో జడ్జీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నుంచి వస్తున్న వాసన, అపరిశుభ్రత వల్ల ఆలయానికి వస్తున్న భక్తులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను ఆలయానికి దూరంగా తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కె. ఎర్రునాయుడు, మొకర నరసింగరావు, పిల్లి శ్రీను, వేణుస్వామి, కదిరి జగన్నాథం, గాడు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందినట్టు జడ్జీ తెలిపారు.

అప్పన్న దర్శనానికి భక్తుల రద్దీ


ఆలయంలో భక్తుల రద్దీ

సింహాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని భక్తులు సోమవారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు, భవానీ మాలల విసర్జన కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పలువురు విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో సింహగిరికి తరలివచ్చారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు కొండపై ఒకే విధమైన రద్దీ కొనసాగింది. అలాగే దసరా సెలవులు కావడంతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన పర్యాటకులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చారు. ఒక దశలో శ్రీఘ్రదర్శనం రూ.300 క్యూలో నిరీక్షించిన భక్తుల సంఖ్య అధికంగా కనిపించింది. సోమ వారం ఒక్క రోజే రూ.300 శ్రీఘ్ర దర్శనం టికెట్లు సుమారు 550కిపైగా విక్రయించారు.

వైభవంగా ఏకాదశి తిరువీధి

సింహాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆశ్వీ యుజమాస శుక్లపక్ష ఏకాదశి పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి వైభవంగా నిర్వహించారు.సోమవారం సాయంత్రం ఉత్సవమూర్తి మదన గోపాలస్వామిని ఉభయదేవేరులతో పల్లకిలో ఉంచారు. ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదపఠనాలు నడుమ సింహగిరి మాడవీధుల్లో తిరువీధి జరిపారు. మార్గం పొడవునా భక్తులు ఫలాలు, కర్పూర నీరాజనాలిచ్చి భక్తిని చాటుకున్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్ర పర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు అందజేశారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

సాగర్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పిజి ఇంజనీరింగ్ కళాశాల రుషికొండ క్యాంపస్‌లో 13 (ఎ) బెటాలియన్ కల్నల్ నీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. విద్యార్థులకు కళాశాల ఎన్‌సీసీ అధికారి ఆర్‌బీ అనంతరావు ఆధ్వర్యంలో మ్యాప్ రీడింగ్, ఫైరింగ్, మిలటరీ హిస్టరీ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

అప్రమత్తంగా ఉండండి : తహసీల్దార్

పద్మనాభం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్ప పీడనం ఏర్పడడంతో రానున్న మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాని తహసీల్దార్ ఆనందరావు కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వీఆర్‌ఓలు, వీఆర్ఏలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా గోస్తనీ నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని చెప్పారు. రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు ఉద్యోగులు అందుబాటులో ఉంటారని చెప్పారు. కాగా అల్పపీడనం నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొట్ట దశలో ఉన్న వరి భారీ వర్షాలకు ఎక్కడ పాడవుతుందోనని భయపడుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం


తౌడుకు ఆర్థిక సహాయం అందిస్తున్న గంటా రవితేజ

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కృష్ణా కాలనీలో అగ్నిప్రమాద బాధితుడు వియ్యపు తౌడుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ సోమవారం రూ. పది వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. తౌడు దొరతోట రోడ్డును ఆనుకుని కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. గత నెల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్ని ప్రమాదంలో రూ. 4 లక్షల వరకూ నష్టపోయాడు. ఈ విషయాన్ని 3వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గొలగాని నరేంద్రకుమార్,తదితరులు ఎమ్మెల్యే గంటా దృష్టికి తీసుకువెళ్లడంతో ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కిళ్ళ వెంకటరావు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కనకల అప్పలనాయుడు, ఆవాల సూరిబాబు, కోండ్రు రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి పట్ల సంతాపం

సాగర్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా సంతాప సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ దేశ ఆర్థిక అభివృద్ధిలో, ఉపాధి కల్పనలో టాటా సంస్థల పాత్ర ఎనలేని దన్నారు. గీతం వర్సిటీకి, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. దాదాపు పది వేల మంది గీతం విద్యార్థులు టీసీఎస్‌లో వివిధ స్థాయిల్లో పని చేస్తున్నారని చెప్పారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ కేవీ ఉమాదేవి మాట్లాడుతూ రతన్ టాటా సమాజం పట్ల బాధ్యత గల పారిశ్రామికవేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కె. నాగేంద్రప్రసాద్, విశాఖ జీసీజీసీ డైరెక్టర్ వంశీకిరణ్ సోమయాజులు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి. రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై ప్రభుత్వం స్పందన హర్షనీయం


విలేకరులతో మాట్లాడుతున్న బీవీ రామ్

భీమునిపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం స్పందిస్తున్న తీరు హర్షనీయమని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. సోమవారం ఆయన బీచ్ రోడ్‌లో ఉన్న గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి భీమిలిలో 15 ఎకరాలు కారుచౌకగా పొందారని ఆరోపించారు. కొత్తవలసలో ఎకరా ధర రూ. 15 కోట్లు నుంచి రూ.20 కోట్లు ఉంటే శారదా పీఠానికి కేవలం రూ.లక్షలకే కట్టబెట్టారని చెప్పారు.దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి, అధికారులను విచారణకు ఆదేశించారని తెలిపారు. చిన్నముషిడివాడలో శారదా పీఠం అక్రమాలపై కూడా దృష్టిసారించాలని కోరారు. సమావేశంలో ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జిల్లా కార్యదర్శి దొరబాబు, డాక్టర్ నికుంజ్, పోలిరాజు ఉన్నారు.

విస్తరణకు నోచుకోని రేవిడి - అయినాడ రోడ్డు

- నిధుల మంజూరులో జాప్యం
- రెండేళ్లుగా ముందుకు సాగని పనులు
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు



ముత్తంశెట్టి శంకుస్థాపన చేసిన శిలా ఫలకం

పద్మనాభం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రేవిడి - అయినాడ రోడ్డు విస్తరణ పనులు రెండేళ్లుగా ముందుకు సాగడం లేదు. వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఈ పనులకు భూమి పూజ చేసినా నిధులు విడుదల చేయలేదు. 2018లో నిర్మించిన పద్మనాభం - మహారాజ్‌పేట రోడ్డు విస్తరణకు సంబంధించిన పాత బకాయిలను గుత్తేదారుకు గత ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. 11.560 కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డు నిర్మాణానికి గత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు 2022 ఫిబ్రవరి 12న భూమి పూజ చేశారు. రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.16 కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులు మంజూరు చేసింది. రేవిడి నుంచి వెంకటాపురం, మజ్జిపేట, కోరాడ, లింగన్నపేట, బిఆర్ తాళ్లవలస, బొత్సపేట, అయినాడ గ్రామాలను కలుపుతూ ఈ రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. పాత బకాయిలు చెల్లిస్తారన్న ఆశతో గుత్తేదారు కొన్నిచోట్ల కల్వర్టులు నిర్మించారు.లింగన్నపేట వద్ద రోడ్డుకు ఇరువైపులా విస్తరణ కోసం గోతులు వేసి కొంత మేరకు వెట్ మిక్సర్, బ్లాక్ మెటలు వేసి మమ అనిపించారు. గాయత్రి ఆలయం సమీపంలో గోతులు తవ్వి వదిలేశారు. ఇవి మినహా ఇతర పనులను గుత్తేదారు చేపట్టలేదు. అయినాడలో బాగున్న రోడ్డును తవ్వేసి వెట్ మిక్సర్ వేసి వదిలేశారు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 20 గ్రామాల ప్రజలు ఈరోడ్డు మీదుగానే విజయనగరంలోని పలు ప్రాంతాలకు వెళ్తుంటారు. విస్తరణ పనుల కోసం నిధులు మంజూరు చేయడంతో చాలాచోట్ల రోడ్డు శిథిలావస్థకు చేరుకున్నా సంబంధిత శాఖాధికారులు నిర్వహణ పనులు చేయడానికి ముందుకు రావడం లేదు.

ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈఈ గంగరాజును వివరణ కోరగా కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వంలో రావాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో పనులు చేపట్టడం లేదన్నారు. త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు.